# అతిథిసత్కారం

శ్రీ వసంతరావు రామకృష్ణారావు

అతిథిని సత్కరించటం ప్రాచీనకాలం నుండీ మనభారతదేశ సాంప్రదాయమైయున్నట్లు తోస్తుంది. మన చరిత్రలో, పూర్వము, రాజులు పరదేశస్థులను గౌరవప్రదంగా ఆదరించినట్లుకూడావుంది. అతిథి అనే పదానికి, తిథియెరుగకుండా సర్వదా తిరుగువాడనీ, ఒకరోజుకంటె ఎక్కువ కాలము నిలువని నూతనవ్యక్తిఅనీ అర్థాలు వున్నాయి. అభ్యాగతిఅంటే భోజనము వేళకు వచ్చినవాడనిభావం. పూర్వం యీ అతిథులను అభ్యాగతులను సత్కరించటం గృహిణీ గృహస్థుల ధర్మంగానుండేది.

దానికి తార్కాణంగా, "అతిథులే తేర నడికిరేయైన చెట్టు, వలయు భోజ్యమ్ములింట నవ్వారిగాగ" అని మనుచరిత్రలో, పెద్దనార్యుడు ప్రవరుని భార్యను వర్ణిస్తాడు. అంటే, నిత్యజీవితంలో, దైనందినమూ, తమ గృహాలకువచ్చే, అతిథి అభ్యాగతులను సత్కరించి, వలసిన సపర్యలుచేయుటం గృహిణీమణుల కార్యంగా వుండేదని తెలుస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే, 'అతిథి సత్కారం' గృహలక్ష్మికి విశిష్టలక్షణంగా మన పూర్వులు పరిగణించేవారు.

అయితే, కాలప్రవాహంలో, పరివర్తనల ఫలితంగా, శీఘ్రగమనంతో మార్పులుచెందే యీ ప్రపంచంలో, నేడు, ప్రాచీన సాంప్రదాయాలకు స్థానం లేకపోవటం వాస్తవమే. మానవుడు, అత్యధికమైన విజ్ఞానతృష్ణతో కృషిచేసి, పెక్కు నూతనవస్తు పరిశోధనల మూలంగా, మానవసంఘంలోను, దేశంలోను, మొత్తం ప్రపంచమంతటిలోను, విపరీతమైన మార్పులను కలిగించాడు.

ఆ కారణంచేతనే, సాంప్రదాయాను సారం, మన గృహిణులకుండవలసిన, భిక్షాప్రదానం, అతిథిసత్కారంవంటి పెక్కు పవిత్రలక్షణాలు విశేషించి నిలచియుండలే నట్లు తోస్తోంది. అయినప్పటికీ ప్రాచీన కాలంనుంచి వస్తోన్న, అతిథిసత్కారం మాత్రం, నేటికీ మనకుటుంబాలలో నిలచి వుండటం, నిజంగా హర్షించవలసిన విషయం.

అతిథిని సత్కరించటం సామాన్య విషయంకాదు. అతిథియెడల గృహస్థునికి గౌరవాదరాలుండాలి. అంటే అతిథుల్ని తన గృహానికి రమ్మని ఆహ్వానించటం గృహస్థులపని; వారిని ఆదరించి, సపర్యలు చేయటం గృహిణులధర్మం. కాగా, వారికి సౌకర్యాలు కలిగించటానికి కార్యభారంగల పురుషునికి వీలుపడదు; వాటినన్నిటినీ సమకూర్చే బాధ్యత గృహలక్ష్మి వహించాలి. అంటే తనకు నిత్యంవుండే పనులతోపాటు, అతిథుల అవసరాలను గ్రహించి, సదుపాయాలు కలిగించటానికి, గృహిణులకు యెంతైనా ఓర్మివుండాలి. ఆవిధంగా అతిథి అభ్యాగతులను సంతృప్తికరంగా సత్కరించేవారు స్త్రీలు; ముఖ్యంగా గృహిణులే అన్నమాట.

ఈ అతిథులు, అభ్యాగతులు, అధిక సంచారపరులు; వారు విశేష సంచారానంతరం గృహస్థులయింట అతిథులై, వారు

చూసినవింతలు,విషయాలను గృహిణీ గృహస్థులకు తెల్పేవారు. తైర్థికులు, అతిథులుగా వచ్చినప్పుడు, వారు, తాము సందర్శించిన పుణ్యక్షేత్రాల మాహాత్మ్యంగూర్చి గృహమేధికి వర్ణించేవారు. ఆవిధంగా, పూర్వం, అతిథులరాకవలన, గృహస్థాశ్రమంలోని వారికి నూతన విషయాలు తెలిసేవి. అతిథి సత్కారం జరుగుటవల్లనే సంచారపరులకు గృహయజమానులకు పరస్పరము ఒకబాంధవ్యమేర్పడి, విషయాలను తెలిసికోగలిగేవారు.

కాని, నేటి ప్రపంచంలో, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అలాంటి అవకాశాలు లేకపోవటం, శోచనీయం. నేటికీ మన అతిథి అభ్యాగతులు, కార్యక్రమాన్ని సాగిస్తున్నారనే నానమ్మకం. విశాలమైన మనదేశంలోని వివిధప్రాంతాలలో, అనాదినుండి పేరుగాంచిన పుణ్యస్థలాలు యెన్నోవున్నాయి. ఆయాస్థలాలకు అరుదెంచే తీర్థయాత్రాపరులు అతిథులుకదా! వారికి సౌకర్యాలు కలిగించి సత్కరించేదెవరు? ఆతిథ్యానికి పేరుపొందిన మనదేశంలో, స్వదేశవాసులను సత్కరించటానికే పరిస్థితులే అంతరాయంగా వున్నట్లు తోస్తుంది. నేడు, అట్టి సదుపాయాలను కలిగించటానికి మనకు అట్టే అవకాశాలుకూడా లేవు; యితరత్రా అట్టి వసతి సౌకర్యాలు కల్పింపబడ్డాయికూడా. అయినప్పటికీ, యీ ఆతిథ్యస్వీకారానికి అలవాటుపడ్డ ఛాందసులు యెవరియింటనో అతిథిగా వెళ్లటం నేటికీజరుగుతోంది.

అంతేకాదు; మనదేశంలోని పశ్చిమోత్తర ప్రాంతాలలో నివసించే కుటుంబాలు కొన్ని నేటికీ అతిథులను సత్కరిస్తున్నాయి. అందులో ప్రధానంగా పఠానుజాతివారు యీవిషయంలో నేటికీ మార్గదర్శకంగా వున్నారు. ప్రాచీనకాలంనుండి వస్తోన్న యీ అతిథిసత్కారం, నేటి పరిణతయుగంలోనూ ప్రధానస్థానం వహించిందనటానికి యిది ఒక ప్రబల నిదర్శనం!

ఇంతకూ, మనభారతదేశం, ఆగంతుకులను ఆదరించింది. అతిథిఅభ్యాగతులను సత్కరించింది. విదేశవాసులను ప్రేమపూర్వకంగా ఆహ్వానించి, ఆతిథ్యమిచ్చి గౌరవించింది. మన భారతీయకుటుంబాలు పరస్పరం సుహృద్భావాలతో ఆతిథ్యాన్ని పాటించుకొన్నాయి. అందువల్లనే అతిథిని సత్కరించటంలో ప్రపంచమంతటిలోను మనదేశం పేరుగడించుకొంది. ప్రాచ్యఖండంలో విశిష్టస్థానం వహించింది. భారతదేశం ఖండాంతరఖ్యాతి గడించటానికి, మన స్త్రీలుచేసిన అతిథిసత్కారమే కారణం. మనదేశంలోని గృహిణీమణులు, విశాల హృదయంతో, ఓర్మితో అతిథులను సత్కరించి, గృహస్థులకు, దేశానికీ పేరుగడించారు.

నేడుకూడా, చిరసాంప్రదాయానుసారమైన యీ ఆతిథ్యానికితగిన దోహద మీయవలసిన బాధ్యత స్త్రీలపై, ముఖ్యంగా గృహిణులపై ఆధారపడివుంది.